**పరిశోధక విద్యార్థి:**
**ఎస్.శంకర్**
**రీసెర్చ్ స్కాలర్ BESTIU,**
**లెక్చరర్ ఇన్ తెలుగు,**
**ఎం. ఏ. ఎల్. డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,గద్వాల.**
**ఫోన్ నెంబర్:- 9985235197**
ఈమెయిల్ :-**sapareshankar@gmail.com.**

**పర్యవేక్షకులు:**
**డాక్టర్ ఎం దేవేంద్ర**
**రీసెర్చ్ సూపర్వైజర్,**
**అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,**
**చాకలి ఐలమ్మ** మహిళా **యూనివర్సిటీ**-కోఠి హైదరాబాద్

# విద్వద్గద్వాల - విఖ్యాత కవనశాల:-

**(పరిశోధన వ్యాసం)**

గద్వాల సంస్థాన చరిత్ర కాకతీయ ప్రభువుల కాలము నుండి ఉన్నట్టు చరిత్ర చెబుతుంది. కృష్ణ, తుంగభద్ర నదుల మధ్య వ్యాపించి ఉన్న, సువిశాల గద్వాల్ ప్రాంతానికి 'దో అబ్' ప్రాంతమని 'నడిగడ్డ' అని పేరు.

క్రీస్తు శకం 1290లో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు గద్వాల సమీపంలోని ఐజ గ్రామవాసి. బుడ్డారెడ్డిని ఏడు సీమల పరిపాలన అధికారిగా నియమించాడు. అందులో ప్రస్తుతం మనం చెప్పబోయే అలంపురం అనగా గద్వాల సీమ ఒకటి. క్రీస్తుశకం 1323 లో మహమ్మదీయులు దండయాత్రల వల్ల, కాకతీయ సామ్రాజ్యం పతనం కావడం వల్ల అయిజ పాలకులు స్వతంత్రులు అయ్యారు వీరు 1347 నుండి 1498 వరకు బహమనీ సుల్తానులకు సామంతులుగా ఉన్నారు తర్వాత బీజాపూర్ సామ్రాజ్యం విస్తరించడంతో తరువాత ఔరంగజేబు కాలంలో గద్వాల ప్రాంతం మొగల్ పాలకుల కిందికి వచ్చింది. మొగల్ రాజుల తర్వాత దక్కన్ సుబేదారి అయినా అసఫ్జాహి నిజాం కు.

సామంత రాజ్యం అయింది. క్రీస్తు శకం 1853 లో ఖర్చుల నిమిత్తం రాజు రాయచూర్ అనగా గద్వాల ప్రాంతాలకు కుంపిని వారికి స్వాధీనం చేసుకున్నారు. క్రీస్తు శకం 1857 నుండి 1858 నాటి సిపాయిలు తిరుగుబాటు సందర్భంగా కుంపిని వారికి ఇజం చేసిన సహాయాన్ని కృతజ్ఞతగా రాయచూర్ ప్రాంతాన్ని బ్రిటిషర్లు,తిరిగి ఒప్పందంతో గద్వాల సంస్థానం హైదరాబాద రాష్ట్రంలో విలీనమైంది.

గద్వాల నామౌచిత్యం:-

గద్వాల దుర్గ నిర్మాణాన్ని గూర్చి కొన్ని ఇతిహాసాలు ప్రచారంలో ఉన్నాయి.

1.సోమనాద్రి కృష్ణానది ఒడ్డున గల ఒక ప్రాంతానికి వేటకు వెళ్ళిండట. అప్పుడు ఆయన వేట కుక్కలను కుందేలు తరిమి కొట్టాయట. ఆ స్థలాన్ని మహత్యాన్ని గుర్తించిన సోమనాద్రి గద్వాల కోటను అక్కడ నిర్మించినట్లు చెప్తారు.

2. సోమనాద్రి పూడూరు లో ఉన్న కాలంలో ఆ కోటను బాగు చేస్తుండగా అతనికి భారీ నిక్షేపం దొరికిందట. గురుపయ్య అన్న తన గురువు సహాయంతో దానిని పొంది ఆయన సలహా మేరకు గద్వాల పట్టణాన్ని నిర్మించాడట.

3.పెద్ద సోమభూపాలుడు తన రాజ్య విస్తరణ కోసం ప్రయత్నిస్తూ ఉండగా ఎక్కడ గద్ద వాలుతుందో అక్కడ కోటను నిర్మించాలని చెన్నకేశవ స్వామి కలలో కనిపించి చెప్పాడట. గుర్రం మీద బయలుదేరి చూసి గద్ద వాలిన చోటనే కోటను నిర్మించాడట.

4. గద్వాల దుర్గ నిర్మాణమును గూర్చి అందరూ ప్రముఖంగా చెప్పే ఇతిహాసం మరొక విధంగా ఉంది.గద్వాల దుర్గాన్ని నిర్మిస్తూ ఉండగా అది మాటిమాటికి కూలిపోతుందట.ఒకనాడు దుర్గ నిర్మాతలకు కలలో ఒక వ్యక్తి సాక్షాత్కరించి వంటిపునక బ్రాహ్మణుని అర్పిస్తే దుర్గం నిలుస్తుందని చెప్పాడట. అప్పుడు కేశవాచార్యుడనే వానిని బలి ఇచ్చాడట .దాని ఫలితంగా దుర్గం నిలిచిందట. బ్రాహ్మ హత్య నివారణకై అతని పేరుమీద కేశవాలయాన్ని నిర్మించారని అంటారు. అందుకే గద్వాలకు" కేశవ నగరం "అని కూడా మరొక పేరు ఉందని మరికొందరి భావన.

గద్వాల రాజవంశీయుల తొలి రాజధాని పూడూరు. ఇక్కడ వారి కులదైవం చెన్నకేశవ స్వామి ఆలయాన్ని నిర్మించారు. గద్వాల ప్రభువుల రాజపత్రాలలో పూడూరుకు కేశవ నగరంగా పేర్కొనబడింది. పూడూరు పాలించిన చాళుక్యులు, పల్లవులు వీరు ఇరువురికి మధ్య యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధ సందర్భంగా గద్వాల ప్రభు పెద్ద సోమభూపాలుడు “గద, వాలము” అనే ఆయుధాలను ప్రయోగించాడు. క్రీస్తు శకం: 1695 - 1705 ప్రాంతంలో పూడూరుకు ఐదు మైళ్ళ దూరంలో ఉన్న, గద్దెపల్లి అనే గ్రామం వద్ద ఉన్న ఒక విశాల ప్రదేశంలో పెద్ద కోట నిర్మించి, దానిపై రెండు ఆయుధాల పేరు మీదుగా సోమ భూపాలుడు గద్దువాల (గద+వాల, గదవాలా గద్వాల) అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. గద్వాల పేరు రావడానికి మరికొన్ని ఐతిహాలు ఈ ప్రాంతంలో వినబడుతుంటాయి.

గద్వాల ప్రభువులు:-

విద్వద్గద్వాల గా పండితులచే కీర్తింపబడిన గద్వాల సంస్థానం తెలంగాణ సంస్థానాలన్నింటిలో విశిష్టమైనది. విలక్షణమైనది. గద్వాల సంస్థాన ప్రభువులు **ముష్టిపల్లి** వంశీయులు, **మిడిమిళ్ళ గోత్రియులు**, పాకనాటి రెడ్లు, శ్రీ చెన్నకేశవస్వామి వారి కులదైవం. వీరిది వైష్ణవ సంప్రదాయం.

సాహిత్య కళా పోషణలు. పాండిత్య పరీక్షల నిర్వహణలో పండిత పోషణలో ,ప్రజారంజక పాలనలో సాధించిన ఘనత గద్వాల ప్రభువుల ప్రత్యేకతను తెలియజేస్తుంది.

గద్వాల సంస్థానాన్ని మొత్తం 12 మంది పురుషులు (వీరిలో కల్లా వెంకటన్న రమణయ్యలు నమ్మిన బంటులు కలిపి) ఏడుగురు మహిళలు పాలించారు. రాజా పెద్ద సోమభూపాలునితో మొదలై, రాజాకృష్ణరామ భూపాల్ వరకు మొత్తం 290 సంవత్సరాల పాలన సాగింది.

## విద్వత్సభలు:-

గద్వాల సంస్థానంలో ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో, మాఘమాసంలో విద్వత్ సభలు జరిగేవి. కార్తీకంలో జరిగేవి వేద శాస్త్ర సభలు. ఇవి శుద్ధ పంచమితో మొదలై, పూర్ణిమతో పూర్తయ్యేవి. ఇందులో ఘన పాఠీలు, లోన పాఠీలు, తర్క వ్యాకరణ, జ్యోతిష పండితులు పాల్గొనేవారు. మాఘమాసంలో సంగీత, సాహిత్య సభలు జరిగేవి. ఈ సభలలో అవధానులు, ఆశు కవులు, గాయకులు, కథకులు, నటులు, సంకీర్తన పరులు మొదలైన వారు పాల్గొనే, వారు ఇవి మాఘశుద్ధ ద్వాదశి నుండి, బహుళ విధియ వరకు జరిగేది.

కార్తీక మాసంలో పండితులు కోటలోకి వెళ్లేటప్పుడు గడప నుండి సభ వరకు, తెల్లని వస్త్రాన్ని పరిచేవారు కార్యక్రమాలు ముగిసిన తర్వాత పండితులు నడిచిన ఆ పాద దూళిని ఎత్తి శుభ్రం చేసి, ప్రతిరోజు ఆ పాద దూళిని నుదుట ధరించేవారట. మాఘమాస సభలలో మొదట ఆశు కవితలే ఉండేవి శ్రీరామ భూపాలుని కాలంలో వచ్చిన తిరుపతి వేంకటకవులతో, అవధానాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ అవధానాలలో సమస్య పూరణలు, ప్రభువులను ఎంతగానో ఆకట్టుకునేవి. ఈ పూరణులకు సమస్యలు పండితులే గాక రాజుగారు కూడా ఇచ్చేవారు. ఈ సంస్థాన విద్వత్ సభలకు ప్రతి సంవత్సరం వచ్చే పండితుల సంఖ్య 3 వేలకు పైనే ఉండేది .పండిత సంభావన, సత్కారాల వ్యవహారం శ్రీ గుండేరావు హర్కారె గారు చూసుకునేవారు. ఈ సభలకు వచ్చే పండితులకు చాలామందికి వీరి ఇంటిలోనే భోజన సదుపాయాలు ఉండేవి.

## గద్వాల సంస్థానం - కవి పండితులు - సాహిత్య సేవ

సాహిత్య చరిత్రలో గద్వాలకున్న స్థానం విశిష్టమైనది, ప్రముఖమైనది. ఎంతోమంది కవి పండితులను, కళాకారులను అక్కున చేర్చుకుని, వారి కళను, వారిలో దాగిన ప్రతిభను, ప్రపంచానికి పరిచయం చేయడానికి పలు రకాల కార్యక్రమాలను నిర్వహించి, వారికి తగిన పారితోషకాలు, పురస్కారాలు, సన్మాన సత్కారాలను నిర్వహించి, వారిని ఆనందింపజేసిన ఘనత గద్వాల సంస్థానానిది. అయితే పండిత పోషణ ఎంత గొప్పగా జరిగిందో, అంత మంచి సాహిత్యం ఈ గద్వాల

నుంచి వచ్చింది అనడానికి ఎన్నో ఉదాహరణలు, ఆడవాళ్లు కనిపిస్తాయి. వీటి ద్వారా నాటి సాహిత్య వైభవం, సరస్వతీపుత్రుల మేధా సంపత్తి ఎంత గొప్పదో మనకు తెలుస్తుంది. అంతేకాక ఆధ్యాత్మికత వెల్లువెత్తింది.

1. **పెద సోమ భూపాలుడు**:-

గద్వాల కోటను కట్టించిన ప్రభువు ఇతడు. కవులు ఇతడిని సోమనాద్రి అని కీర్తించారు. ఇతడు రాజకవి జయదేవుడు సంస్కృతంలో రచించిన గీతగోవిందం అనే అష్టపదులను, తెలుగులోకి అనువదించాడు. ఈ అనువాదంలో శ్లోకాలు, పద్యాలు, దరువులు, చూర్ణికలు మొదలైనవి ఉన్నాయి. ఈ గ్రంథం అసమగ్ర ప్రతి. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది.

2.**కొటికెలపూడి వీరరాఘవకవి**:-

ఇతడు పెదసోమభూపాలుని కాలంలో వినుకొండ సంస్థానం నుండి వచ్చి, గద్వాల సంస్థానంలో స్థిరపడ్డాడు. ఇతనికి **అభినవ తిక్కన అని బిరుదు.** సోమ భూపాలుని కోరికపై యథా శ్లోక తాత్పర్య భారతోద్యోగ పర్వమును ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధంగా తెలుగులో రచించాడు. గద్వాల సాహిత్య విద్య హక్కుల ముద్రాక్షరశాలలో 1899 లో ముద్రించబడింది." **నవీనం ద్రోణ పర్వం"** అనేది ఈ కవి మరో రచన.

3. **చిన్న సోమభూపాలుడు**:-

అభినవభోజుడి గా కీర్తింపబడిన రాజకవి. గద్వాల సంస్థానంలో మాఘ కార్తీక మాసాలలో విద్వత్ సభలను నిర్వహించిన రాజులలో ఇతడు ప్రథమ గన్యుడు. హరి భట్టు సంస్కృతంలో రచించిన **రతి శాస్త్రమును** ఇతడు తెలుగులోకి అనువదించాడు. ఇతని కోరిక మేరకే కాణాదం పెద్దన సోమయాజి, శ్రీమద్రామాయణాన్ని యతాశ్లోక తాత్పర్య రామాయణంగా తెలుగులోకి అనువదించారు.

4.**కాణాదం పెద్దన సోమయాజి**:-

క్రీ,,శ.1690 లో కర్నూలు జిల్లా బనగాని పల్లె మండలం నందవరం లో జన్మించారని, క్రీస్తు శకం 1700-1710 వరకు దుర్వేసి, కోవెలకుంట్ల తాలూకా లోని బావగారు నాగార్యుని దగ్గర. కొల్లాపురం ప్రాంతంలో పిల్లే మల్లేశ్వర దీక్షకుల వద్ధ విద్యాభ్యాసం. విప్రవంశం అనే రచన చేశాడని క్రీస్తు శకం 1710- 1712 గద్వాల సంస్థానం పేద సోమభూపాలుని ఆశ్రయం. పెద సోమభూపాల దండకం, భద్రజయోపాఖ్యానం రచనలు. 1712లో రాజావారి మరణంతో యథా శ్లోకం తాత్పర్య రామాయణ బాలకాండ రచన ఆగిపోయిందని, క్రీస్తు శకం 1713 నుండి 1751 వరకు బోరవెల్లి సంస్థానం గిరి అమ్మగారి ఆశ్రయం. భోజ చెంపూ వ్యాఖ్యాది రచనలు చేశారని, క్రీస్తు శకం 1752 నుండి 1762 వరకు సురపుర సంస్థానం పామినాయకుని ఆశ్రయం.

5.**కొత్తపల్లి రామాచార్యులు**:-

చిన సోమభూపాలుని కోరిక మేరకు, యథా శ్లోక తాత్పర్య రామాయణంలోని అయోధ్యకాండ ను 5 ఆశ్వాసాలలో రచించాడు.

6.**గార్గేయపుర సుబ్బశాస్త్రి**:-

యధా శ్లోక తాత్పర్య రామాయణంలోని అరణ్యకాండను మూడు ఆశ్వాసాలలో రచించాడు. శ్రీకృష్ణ లీలా తరంగిణి ఇతని మరో రచన. ఇది జయదేవుని సంస్కృత గీత గోవిందమునకు అనువాద కృతి.

7. **కామసముద్రం అప్పలాచార్యుడు**:-

చిన్న సోమభూపాలని ఆస్థానంలోని ఈ కవి, **అష్టభాషా కవితా విలాసుని** గా పేరుగాంచారు. యథా శ్లోక తాత్పర్య రామాయణంలోని సుందరకాండ ను మూడు అశ్వాసాలలో రచించాడు.

8. **కిరీట వేంకటాచార్యులు**:-

చిన్న సోమభూపాలుని కాలంలో సురపుర సంస్థానం నుండి, గద్వాల సంస్థానానికి వచ్చాడు. **కవితార్కిక కంఠీరవ, శేష యమక చక్రవర్తి, సర్వ తంత్ర స్వతంత్ర** మొదలైనవి వీరి బిరుదులు. 1..అలంకార క్రైస్తవం, 2.భావ శతకం, 3.కళ్యాణపురంజనము, 4.దశావతార స్తోత్రము, 5.జంజా మారుతం, 6.శృంగార లహరి,

7.వేదాంత కారికావళి, 8.హయగ్రీవ దండకం, 9.అచలాత్మజా పరిణయం, అను పద్యానికి శ్రీమాన్ వైద్యం వెంకటాచార్యుల వారు 50 బంధ చిత్రాలు సమకూర్చారు. ఆ 50 బంధ చిత్రాలతో పాటు కొన్ని బంధ చిత్రాలు ఈ వ్యాసకర్త బై రోజు రాజశేఖర్ వేశారు.

9.**శ్రీరామ భూపాలుడు**:-

గద్వాల సంస్థాన అభివృద్ధికి ఘననీయ కృషిచేసిన ప్రభువు ఇతడు. గద్వాల కోటలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం ముఖ ద్వారాన్ని ఇతనే రజితమయం చేయించాడు. ఇతడు కూడా రాజకవి. చందోముకురము, శ్రీ లక్ష్మీ సహస్రనామ స్తోత్రం వీరి రచనలు.

10. **పురాణం దీక్షాచార్యులు**:-

ఇతడు రాజా శ్రీరామ భూపాలుని విద్య గురువు. 1. రామచంపవు, 2.రామనృప కర్ణామృతం, 3.కేశవ సుప్రభాతం,4. కావ్యోత్కర్ష, వీరి రచనలు

11. **తిరుపతి వేంకట కవులు**:-

రాజా రామ భూపాల్ కాలంలో గద్వాల సంస్థానాన్ని సందర్శించి, తమ కవితా పాటవాన్ని ప్రదర్శించి, ఎన్నో సత్కారాలు అందుకున్న కవులలో తిరుపతి వెంకట కవులు సుప్రసిద్ధులు. వీరు గద్వాల సంస్థానాన్ని ఐదుసార్లు దర్శించారు. **లక్షణా పరిణయం** అనే వీరి రచన, గద్వాల సాహిత్య విద్యాముకుర రముద్రాక్షరశాలలో 1902 సంవత్సరంలో ముద్రణకు నోచుకున్నది.

12. **కవిసింహ పోకూరి కాశీపతి**:-

గద్వాల సంస్థానాన్ని దర్శించిన కవివరేణ్యులలో ఇతడు ప్రసిద్ధుడు. రాజా సీతారామ భూపాల్ పాలనా కాలంలో 1921 సంవత్సరంలో, ఇతడు తొలిసారిగా గద్వాల పండిత సభల్లో పాల్గొని, రాజావారికి తన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని సమర్పించుకున్నాడట. కీర్తి కావ్య నిర్మాత గా చతుర్విధ "కవిదురీణునిగా, అవధానపంచాననులుగా, సుప్రసిద్ధులు 1.సత్రశాల మల్లేశ్వరం శతకం, 2.శ్రీ కేశవేంద్ర శతకం, 3.శ్రీశైల మల్లేశ్వర శతకం, 4.సునీత శతకం, మొదలైన 60 శతకాలు రచించిన కవి ఇతడు.

1.నిర్యోష్ఠ నిర్వచన శుద్ధాంధ్ర హరిశ్చంద్రోపాఖ్యానం, 2.సారంగధరీయం, 3. శౌరి శైశవ లీల (దశాక్షరీయ కావ్యం), 4. త్రిశందర్ధపద్యరత్నం (30 అర్థాలతో ఒకే పద్యం), 5. నరసింహ నిరసన స్తుతి, 6.సిద్ధయోగి చరిత్ర, 7.కాశీపతి చమత్కృతి, 8.కాఫీ దండకం మొదలైనవి వీరి రచనలు. "కవి సింహ, మహాకవిశేఖర, చిత్రకవి సార్వభౌమ" వీరి బిరుదులు. కాశీపతి తన సారంగదరీయ కావ్యంలో ప్రబంధ కవుల పోకడలను పాటించి, శబ్దాలంకార విలసత్వాన్ని ప్రదర్శించి, నాణ్యతో సదృశ్యంగా నిలిచారు.

ఈ విధంగా సాహిత్యం అంటే గద్వాల గద్వాల అంటే సాహిత్యం అన్న చందంగా దినదిన ప్రవర్ధమానమై ఎందరో మహా మహా విద్వాంసులను కవి పండిత శ్రేష్టులను పెంచి పోషించిన ఘనత గద్వాల సంస్థానానికే దక్కుతుంది పైన తెలిపిన కొందరు రచయితలే కాక అందులో విమర్శకులు అవధానులు జ్యోతిష్య శాస్త్ర పండితులు వంటి ఎందరో మేధావులు ఉన్నారు. అలాంటి వారిలో మరికొందరిని చూస్తే "***బైరంపల్లి తిరుమల రాయకవి, చెట్లూరి నారాయణచార్యులు, పురాణం నరసింహచార్యులు, యజ్ఞ దీక్షితులు, హయగ్రీవాచార్యులు, శ్రీ కృష్ణార్యుడు, అర్చకం అయ్యామాచార్యులు, కర్ణమడకల అనంత ఆచార్యులు, అక్షింతల సింగరశాస్త్రి, పుల్లగుమ్మి వెంకటాచార్యులు, ఆదిపూడి ప్రభాకరరావు, ఆశ దుర్గం వేదాంత ఆచార్యులు, పిశుపాటి చిదంబర శాస్త్రి, చెమికుల చెన్నారెడ్డి ధర్మవరం కృష్ణమాచార్యులు వెల్లాల సదాశివ శాస్త్రి గుండేరావు హర్కారే జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆదిపూడి సోమనాథరావు, చెట్లూరి శేషాచార్యులు, హారతి దేశికాచార్యులు, గొబ్బూరి సంజన, వేదాల తిరుమల వెంకట వరదాచార్యులు, తెలకపల్లి రామచంద్రశాస్త్రి, బుక్కపట్నం రామచంద్ర కవి, ఎం బలరామరెడ్డి సింగంపల్లి సీతారామ సిద్ధాంతి ఉప్పల వెంకట శాస్త్రి ప్రతి కంఠం రామరాజు, శ్యామరాజు, కేశవ పంతుల నరసింహ శాస్త్రి, మణిమణి గోపాల కవి,*** వంటి లెక్కకు మిక్కిలి విధ్వంసులు ఈ గద్వాల సంస్థానంలో వారి ప్రతిభా ప్రదర్శనను గావించినవారు.

ఏది ఏమైనా, ***సారస్వత లోకంలో ఒక చెరగని ముద్ర వేసిన సంస్థాన సాహిత్యం ఏదైనా ఉన్నది*** అని అంటే, అది కేవలం ఆ గొప్పతనం ఘనత గద్వాల సంస్థానానికి మాత్రమే చెందుతుంది. అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. జయహో గద్వాల! జయహో కవనశాల!!.

*__ఉపయుక్త గ్రంథాలు__:-


1. జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర స్వరూపం.
2. జోగులాంబ గద్వాల జిల్లా సాహిత్య చరిత్ర- సాంబరాజు రవి ప్రకాష్ రావు
3. గద్వాల సంస్థానం సాహిత్య సేవ- డాక్టర్ హరి శివకుమార్